క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెద్దాపురం: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, ఉదయం 10.30కు మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిల్ సభ్యులు, ఆయా విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల కిటకిట



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారు

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాఘ మాసం చివరి సోమవారం, స్వామివారి కల్యాణ ఉత్సవాలను పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారికి నీటితో అభిషేకాలు, ప్రత్యేక పూజలను పిఠాపురం మహారాజా పేరున నిర్వహించారు. తొలి అభిషేకం, తొలి పూజను తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజ్‌గోపాల్ శర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, భాస్కర్, చెరుకూరి రాంబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ప్రసాదం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ఉండూరు హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న పుల్లయ్య

సామర్లకోట: ఉండూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ-2 పి.పుల్లయ్య సోమవారం తనిఖీ చేశారు. హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణనూ పరిశీలించారు. శిక్షణ పొందిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థి భోజనం చేసేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. భోజనంలో లోపాలుంటే విద్యార్థులు ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: వివిధ వ్యాధులను గుర్తించడానికి వైద్యారోగ్య శాఖ నిర్వహిస్తున్న సర్వేకు అందరూ సహకరించాలని గొల్లప్రోలు హెల్త్ సూపర్‌వైజర్ అహ్మద్ బాషా కోరారు. ఆయన సోమవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నోటి క్యాన్సర్, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్, థైరాయిడ్, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను గుర్తించి, వారికి తగిన వైద్య సేవలు అందించడానికి సర్వే నిర్వహిస్తున్నట్టు వివరించారు. క్యాన్సర్ నుంచి సంపూర్ణ రక్షణ కల్పించడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కొత్తపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తహసీల్దార్ చిన్నారావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, తహసీల్దార్ కార్యాలయంలో ఒకటి, జెడ్పీ హైస్కూల్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మండలంలో 1,215 మంది పురుషులు, 604 మంది మహిళా గ్రాడ్యుయేట్లతో పాటు, మరో 20 మంది కొత్త పట్టభద్రులు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటితో పాటు, అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.



కుక్కుటేశ్వర స్వామికి భక్తులు సమర్పించిన సారె



గ్రామోత్సవంలో ఊరేగుతున్న కుక్కుటేశ్వరుడు



కుక్కుటేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న అర్చకులు



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ ఈఓ



పెండ్లి కుమారుడిగా కుక్కుటేశ్వరుడు, పెండ్లి కుమార్తెగా రాజరాజేశ్వరీదేవి

శంభో శివ శంభో

- అంకురార్పణతో వైభవంగా ప్రారంభమైన శివరాత్రి మహోత్సవాలు
- శివన్నామ స్మరణతో మార్మోగిన పాదగయ క్షేత్రం

పిఠాపురం: మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం, అంకురార్పణతో పాదగయ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలు సోమవారం ఉదయం జోరందుకున్నాయి. రాత్రి స్వామివారి కల్యాణోత్సవంతో పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహా శివరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనగా, పసుపు వాయ వేశారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో కుక్కుటేశ్వరునికి రాజరాజేశ్వరీదేవికి కల్యాణ స్నానమాచరింపజేసి, స్వామివారిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెలను చేశారు. ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఈఓ జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు.

తొలి రోజు స్వామివారు గ్రామోత్సవంలో గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. కుక్కుటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించగా, ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



స్వామివారికి కల్యాణ స్నానం ఆచరింపజేస్తున్న అర్చకులు

అంగరంగ వైభవంగా ఆది దేవుని కల్యాణం



దుర్గాడ శివాలయంలో స్వామివారి కల్యాణానికి పసుపు వాయ వేస్తున్న ముత్తైదువులు



దుర్గాడ శివాలయంలో కల్యాణాలంకారంలో రామలింగేశ్వరుడు

దుర్గాడలో కల్యాణ శోభ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉమా రామలింగేశ్వర స్వామివారి కల్యాణానికి భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రాగా, సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. ఆది దేవుని కల్యాణానికి ముత్తైదువులు పసుపు వాయ వేయగా, భక్తులు పెళ్లి పెద్దలుగా తరలి రావడంతో దుర్గాడ గ్రామంలో పెళ్లి కళ సంతరించుకుంది. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా స్వామి, అమ్మవార్లను తీసుకుని సారె చీరలతో తరలివచ్చి కల్యాణ వేదికకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు స్వామివారి కల్యాణం కన్నుల పండువలా నిర్వహించగా, భక్తులు కనులారా వీక్షించారు. స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

కన్నుల పండువలా భీమేశ్వరుని కల్యాణం

- భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు ప్రారంభం
- ఉదయం పూజలు, మధ్యాహ్నం గ్రామోత్సవం
- పంచారామ క్షేత్రంలో 26న మహా శివరాత్రి

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. రాత్రి స్వామివారికి కల్యాణం జరిగింది. కల్యాణాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, పట్టువస్త్రాలు, బంగారు కిరీటంతో అలంకరణలు చేశారు. ఆలయంలో సోమవారం నుంచి మార్చి ఒకటో తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. 26న మహా శివరాత్రి సందర్భంగా స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకోవడానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 27న రథోత్సవం, మార్చి ఒకటిన స్వామివారికి పుష్పయోగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. దీనిలో భాగంగా ఉదయం ఆలయంలో విఘ్నేశ్వర పూజ, అంకురార్పణ, దీక్షాధారణ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామికి, అమ్మవార్లకు భక్త సంఘం నాయకుడు బిక్కిన సాయి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ పండితులు ఆ వస్త్రాలతో అలంకరణ చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు పూజలు నిర్వహించారు. భక్త సంఘం నాయకుడు తలుపుల అంజనీకుమార్ పాల్గొన్నారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో స్వామివారి గ్రామోత్సవం



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల పల్లకీ ఉత్సవం



పంచారామ క్షేత్రంలో కల్యాణం సందర్భంగా విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ

భక్తుల వద్దకు వచ్చిన గ్రామోత్సవం

కల్యాణ ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం ఇత్తడి నంది వాహనంపై గ్రామోత్సవం ప్రారంభమైంది. పూలతోను, విద్యుద్దీపాలతోను అలంకరించిన నంది వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచారు. ఆలయ పండితుల వేద మంత్రాల మధ్య ఈ గ్రామోత్సవాన్ని ఈఓ బళ్ల నీలకంఠం ప్రారంభించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, భక్త సంఘం నాయకులు పాల్గొన్నారు. ఆలయం నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా స్టేషన్ సెంటర్, గాంధీచౌక్ నుంచి చిన్నవీధి, పెద్ద వీధి, యార్లగడ్డ వారి వీధి, కొత్తూరు, అయోధ్య రామపురం, దేవీచౌక్ మీదుగా స్వామివారి గ్రామోత్సవం ఆలయానికి చేరింది. ఉత్సవమూర్తుల విగ్రహాలకు రాత్రి కల్యాణం జరిపించారు.

సింహాద్రి అప్పన్న కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవంలో కళాకారుల తప్పెటగుళ్లు

కొత్తపల్లి: వేద మంత్రాల నడుమ సింహాద్రి అప్పన్న కల్యాణ మహోత్సవం సోమవారం ఇక్కడ కన్నుల పండువగా జరిగింది. దివంగత మాజీ సర్పంచ్ చోడ్డిశెట్టి పెద్దబూరయ్యా కుమారుల ఆధ్వర్యంలో యాదవ కుటుంబీకుల సారథ్యంలో తాడిపెద్దు(సింహాద్రి అప్పన్న)కు వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అచ్చు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. అచ్చు వేసిన సింహాద్రి అప్పన్నకు ఆవుతో శాస్త్రోక్తంగా వివాహం జరిపించారు. సామర్లకోట, తుని సమీపంలో కృష్ణాపురానికి చెందిన యాదవులు రెండు బృందాలుగా తప్పెట గుళ్ల ప్రదర్శన చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిగింది.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం

- దివ్యాంగుల పింఛన్లపై గరంగరం
- గ్రంథాలయ భవనం నిర్మించాలని సభ్యుల డిమాండ్

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం వాడీవేడిగా జరిగింది. సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షత వహించారు. పట్టణంలోని 700 మంది దివ్యాంగ పింఛనుదారులు ఉండగా, వీరిలో 400 మందికి పింఛన్లు తొలగిస్తున్నట్లు నోటీసులు వచ్చాయని కౌన్సిలర్ నేతల హరిబాబు ధ్వజమెత్తారు. దివ్యాంగులకు అన్యాయం చేయడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. సర్టిఫికెట్లు తీసుకొస్తే, తిరిగి కొనసాగిస్తామని కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. దివ్యాంగులు కాకినాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి రావడం కష్టమని హరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నోటీసులిచ్చామని కమిషనర్ తెలిపారు. పింఛను మొత్తం రెట్టింపు చేసి, వారి పొట్టగొట్టడానికి ప్రయత్నిస్తే సహించేది లేదని హరిబాబు హెచ్చరించారు. నిత్యం అనేక మంది నీలమ్మ చెరువు గట్టుపై వాకింగ్ చేస్తున్నారని, వాకింగ్ ప్రాంతం అధ్వానంగా ఉందని కౌన్సిలర్లు నమ్మి సూర్యదుర్గాభవాని, నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ ఆరోపించారు. గ్రంథాలయం అద్దె భవనంలో రెండో అంతస్తులో ఉండటం వల్ల వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. మున్సిపల్ స్థలాన్ని కేటాయించి, గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. గతంలో గొల్లగూడెంలో బహిరంగ మరుగు దొడ్డి స్థలాన్ని కేటాయించగా, ఆ స్థల వివాదం కోర్టులో ఉందని టీపీఓ మంజుల వివరణ ఇచ్చారు.

పూడికతీత అధ్వానం

మున్సిపాలిటీలో సుమారు మూడు నెలల క్రితం ప్రారంభమైన పూడికతీత పనులు అధ్వానంగా ఉన్నాయని కౌన్సిలర్ కరణం రాజ్‌కుమార్ ఆరోపించారు. ఈ పనులపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ అరుణ సూచన మేరకు, మున్సిపల్ ఏఈ ఎం.రమేష్‌బాబు ఇచ్చిన వివరణతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పూడికతీత పనులు మధ్యలో నిలిపివేసి, కాంట్రాక్టర్ మరో పనులు చేయడం సరికాదన్నారు. పిఠాపురం రోడ్డు కంపోస్టు యార్డుగా మారుతుందని సభ్యులు పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబు, జట్ల మోహన్, సేపెని సురేష్ తెలిపారు. ఆ రోడ్డులో నిత్యం లైట్లు వెలిగేలా చూడాలన్నారు. అనేక ప్రాంతాలల్లో 24 గంటలూ లైట్లు వెలుగుతున్నాయని సభ్యులు ఆరోపించారు.



అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు



సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్లు

ఘనంగా రాజశేఖర స్వామి కల్యాణం

కొత్తపల్లి: బాలాత్రిపుర సుందరీ, రాజశేఖరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానికంగా ఉన్న ఆలయంలో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా కల్యాణం జరిగింది. ఉదయం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో మేళతాళాలతో పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, కోలాటం, బుధవారం మహా శివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం లలితాపారాయణం, గురువారం స్వామివారికి అభిషేకాలు, భక్తి పాటల పోటీ, శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు, తీర్థం, రథోత్సవం, కోలాటం, శనివారం పుష్పయాగంతో కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం తెలిపారు.



కొత్తపల్లిలో రాజశేఖరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ప్రణాళికాబద్ధంగా పది పరీక్షలకు సిద్ధం

డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు

సామర్లకోట: పదో తరగతి పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి నాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. మార్చి 17 నుంచి ప్రారంభమవుతున్న పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాల్సిన పరిస్థితులను వివరించారు. నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కావడంతో పాటు, గ్రేడ్-ఎ సాధన కోసం విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారిపై ఒత్తిడి లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వరరావు

జూదరుల అరెస్టు

పెద్దాపురం: పట్టణంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్సై మౌనిక సోమవారం సాయంత్రం తెలిపారు. ఈ దాడిలో రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

చికెన్, ఎగ్ మేళాకు క్యూ



మేళాకు క్యూ కట్టిన మాంసాహార ప్రియులు

కొత్తపల్లి: బర్డ్ ఫ్లూ కారణంగా చికెన్, కోడిగుడ్లు తినరాదని కొంతకాలంగా ప్రచారం జరగడంతో ప్రజలు వాటికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో సోమవారం చికెన్, కోడిగుడ్ల వంటకాల ఉచిత మేళా నిర్వహించారు. ఈ మేళాకు ప్రజలు క్యూ కట్టారు. 70 డిగ్రీల ఉష్ణోగ్రత పైబడి ఉడికించే ఆహారంలో బర్డ్ ఫ్లూ వైరస్ ఉండదని వెంకాబ్ సంస్థ ప్రతినిధి చెప్పారు. ఉన్నతాధికారుల అనుమతులతో ప్రతి రోజూ జిల్లాలో ప్రతి రోజూ రెండు మేళాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

చికెన్ తినవచ్చు: డీఎంహెచ్‌ఓ

కాకినాడ క్రైం: నిర్భయంగా చికెన్, కోడిగుడ్లు తినవచ్చని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరసింహ నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఒక్క బర్డ్ ఫ్లూ కేసు కూడా నమోదు కాలేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో నిరాటంకంగా కోడి గుడ్ల సరఫరా జరుగుతోందని చెప్పారు. ప్రజలకు అవగాహన కోసం పౌల్ట్రీ సంస్థలు చికెన్ మేళాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. 75 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో చికెన్ వండితే పూర్తి ఆరోగ్యవంతమన్నారు. ఇక్కడి ప్రాంతాల్లో 100-110 డిగ్రీల సెంటీగ్రేడ్ వేడితో చికెన్ వండే అలవాటు ఉందని తెలిపారు. ముడి మాంసం, సగం ఉడికించిన కోడి గుడ్లు, హాఫ్ బాయిల్ ఆమ్లెట్లు తినవద్దని సూచించారు.

విద్యార్థులపై తీవ్రంగా సినిమాల ప్రభావం

ఎస్సై మౌనిక

పెద్దాపురం: సమాజంలో విద్యార్థులపై సినిమాల ప్రభావం ఎక్కువగా ఉందని ఎస్సై మౌనిక అన్నారు. సినిమాలు వేరు, నిజ జీవితం వేరనే విషయం ప్రతి విద్యార్థీ గ్రహించాలన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు పలు అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. హెచ్‌ఎం మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎస్సై మౌనిక మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి హెయిర్ స్టైల్ సాధారణంగా ఉండాలని, చింపురు జుట్టు, ఫ్యాషన్ పేరిట మోడల్ కటింగ్స్‌తో తమ జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. చాలా మంది విద్యార్థులు ఆకతాయితనంతో ప్రవర్తిస్తున్నారన్నారు. ఇప్పటి నుంచే ప్రతి విద్యార్థిలో మార్పు తెచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విద్య, క్రీడలపై శ్రద్ధ చూపుతూ, మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మన్యం చిన్న, పీడీ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్‌బీ పట్నంలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై మౌనిక

ఉపాధి చూపిన మహోన్నతుడు గూటెన్ బర్గ్

బోట్‌క్లబ్: ప్రింటర్స్ పితామహుడు జోహన్స్ గూటెన్ బర్గ్ ఆవిష్కరించిన మెషీన్ కారణంగా ఎంతో మందికి ఉపాధి దొరికిందని, ప్రింటర్ల మదిలో ఆయన చిరస్థాయిగా నిలిచారని మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోరుమిల్లి బాలప్రసాద్ అన్నారు. ప్రింటర్స్ డే సందర్భంగా జోహన్స్ గూటెన్ బర్గ్ జయంతిని కాకినాడ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మెజిస్టిక్ వీధిలోని ప్రింటింగ్ సముదాయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గూటెన్ బర్గ్ చిత్రపటానికి ముఖ్య అతిథి మంత్రిప్రగడ వారి సత్రం ఈఓ సుబ్రహ్మణ్యం పూలమాల వేసి నివాళులర్పించారు. బాలప్రసాద్ మాట్లాడుతూ, సత్యదేవా ప్రింటింగ్ క్లస్టర్ సేవలను ప్రింటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రింటర్స్ డే సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు కృష్ణా ఎంపోరియం అధినేత నానాజీ సమకూర్చిన బహుమతులను అందించారు. సంఘ సేవా కార్యక్రమాల్లో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రింటర్ కార్మికుడికి రూ.25 వేల ఆర్థికసాయం అందించారు. వెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు.



గూటెన్ బర్గ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు